క్లుప్తంగా

ఎస్సీలకు ప్రకృతి సాగు కిట్లు


విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న దృశ్యం

చీడికాడ: ఎస్సీ రైతులకు ప్రోత్సాహకంగా రూ.10 వేల విలువ పి.ఎం–డి.ఎస్ కిట్‌లు అందిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర జనరల్ మేనేజర్ సునీల్‌రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోనాంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విత్తన శుద్ధిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కిట్‌లో ఐదు రకాల కూరగాయల విత్తనాలు, కషాయాల తయారీకిగాను డ్రమ్ములు, టార్పాలిన్లు ఉంటాయన్నారు. డీపీఎం లచ్చన్న, ఎంపీపీ కురచా జయమ్మ, మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ యర్రా అప్పారావు, వైస్ ఎంపీపీ చిన్నమ్మలు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు


శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

గొలుగొండ: చోద్యం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో తాగునీటి బోరు ఏర్పాటు పనులను వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల గడప గడపకు కార్యక్రమంలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్‌ను ఇక్కడ తాగునీటి బోరు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో ఆయన మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.5 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

రోలుగుంట: నిండుగొండలో రూ.5 లక్షలతో చేపట్టే కల్వర్టు నిర్మాణ పనులకు సర్పంచ్ శెట్టి సంధ్య టెంకాయ కొట్టి శుక్రవారం ప్రారంభించారు. ఇక్కడ ఉప్పలపు రాజు ఇంటి నుంచి నరం రమణ ఇంటి వరకు డ్రైనేజీతోపాటు కల్వర్టు ఏర్పాటు కోసం ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారన్నారు. మాజీ ఎంపీటీసీ శెట్టి వెంకటరాజారావు, వార్డు మెంబరు అప్పలనాయుడు వీధివాసులు పాల్గొన్నారు.

పాల సొసైటీ అధ్యక్షుడిగా వెంకట కృష్ణారావు

మాడుగుల: స్థానిక సొసైటీ భవనంలో మాడుగుల పాల సొసైటీ అధ్యక్షుడిగా పాము వెంకట కృష్ణారావును శుక్రవారం ఏకగ్రీవంగా పాలకవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సొసైటీకి ఇద్దరు డైరెక్టర్లు ఏకగ్రీవం కాగా, వారిలో వెంకట కృష్ణారావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. బొడ్డేడ గంగాధర్, కర్రి నాగేశ్వరరావు, ఆర్లె రాజు, గండి జగన్నాథరావు, తురుబిల్లి సత్యారావు, డోకల సత్యనారాయణ, యడ్ల హేమంత్ కుమార్, పల్లి సోమునాయుడు అభినందించారు.

వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం


పదోన్నతి పొందిన ఉపాధ్యాయునికి సత్కారం

చోడవరం రూరల్: నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 40 మంది వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పక్క మండలాలకు బదిలీలపై వచ్చిన వారికి, వెళ్లిన వారికి సాదర స్వాగతం, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొందిన స్కూల్ గేమ్స్ సెక్రటరీ ఆళ్ల శేఖర్‌ను సత్కరించారు. చుక్కపల్లి పాఠశాల హెచ్‌ఎం బి.చిరంజీవి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షుడు కె.ఎం.నాయుడు, కార్యదర్శి బి.కిరణ్ కుమార్, కోశాధికారి బి.సింహాచలం, లక్కవరం హెచ్‌ఎం సింగంపల్లి అప్పలనాయుడులు తదితరులు మాట్లాడారు.

టీడీపీ సభ్యులపై చర్యలకు పాలకపక్షం డిమాండ్

- వాడి వేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- రాజకీయ వేదికగా మార్చవద్దన్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి


సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడి వేడిగా సాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముందుగా అధికారులు ఎజెండాలోని అంశాలను సభలో చదివి వినిపించారు. సమావేశానికి విచ్చేసిన టీడీపీ కౌన్సిలర్లు సభ ప్రారంభం కాకుండానే బయటకు వెళ్లిపోవటాన్ని వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు తప్పుబట్టారు. టీడీపీ కౌన్సిలర్లకు రాజకీయ ప్రయోజనాల తప్ప ప్రజా సమస్యలపై చర్చించే ఓపిక లేదని, ప్రతిసారి సమావేశాలకు వచ్చి సంతకాలు చేసి వాకౌట్ చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్‌ను కోరారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, జనసేన కౌన్సిలర్ సౌజన్య మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పట్టణంలో చేపట్టిన పనులు మధ్యలో వదిలేస్తున్నారని ఆమె నిలదీశారు. దీనిపై వైస్ చైర్మన్ జోక్యం చేసుకుని వారి నాయకుడు పవన్‌కల్యాణ్‌లా గ్యాప్, గ్యాప్ సమావేశాల్లా తమ అభివృద్ధి పనులు ఉండవని ఎద్దేవా చేశారు. ప్రజల పక్షాన పారిశుద్ధ్యం గురించి మాట్లాడితే తమ నాయకుడు గురించి ఇక్కడ మాట్లాడటం సరికాదని జనసేన కౌన్సిలర్ అన్నారు. చైర్‌పర్సన్ కల్పించుకుని కౌన్సిల్ సమావేశాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దని ఆమెకు సూచించారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను స్వయంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై పాలక పక్షం కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి అసహనం వ్యక్తం చేశారు. ఈ దశలో అధికార పక్షం కౌన్సిలర్లు, జనసేన కౌన్సిలర్ మధ్య కొద్దిసేపు సభలో అరుపులు, కేకలు చోటు చేసుకున్నాయి. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి పెద్ద పీట

- గిరిజన గ్రామాల్లో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గడప గడపకు పర్యటన


బొడ్డరేవులో దివ్యాంగుడితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు

మాడుగుల రూరల్: గిరిజన గ్రామాలను ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం శంకరం పంచాయతీ శివారు సూర్యనారాయణపురం, బొడ్డరేవు, రామచంద్రపురం, మామిడిపాలెం గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరిగారు. 830 ఇళ్లను సందర్శించిన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో 875 మంది లబ్ధిదారులకు రూ.6,53,74,699 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఈ క్రమంలో రెండేళ్ల క్రితం లారీ ప్రమాదంలో కుడి కాలు కోల్పోయిన బొడ్డరేవుకు చెందిన దివ్యాంగుడు డిప్పల కన్నయ్యదొర తనకు సదరం సర్టిఫికెట్ ఇవ్వలేదని వాపోయాడు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఉరకగెడ్డ దాటి మామిడిపాలెం గ్రామంలోకి వెళ్లి గ్రామస్తుల సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ శోలం రమేష్, ఉప సర్పంచ్ దేవి, ఎంపీటీసీ తుర్రె సత్యవతి, ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, మండల సచివాలయాల కన్వీనర్ బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు గొల్లవిల్లి సంజీవిరావు, ఎడ్ల కళావతి పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న సురక్ష గ్రామసభలు

దేవరాపల్లి: జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామ రక్షగా నిలుస్తుందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం–2లో జెడ్పీటీసీ కర్రి సత్యంతో కలిసి ఆమె పాల్గొని మాట్లాడారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి కె.వి. రమణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక జగనన్న సురక్ష కార్యక్రమమన్నారు. సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి పాల్గొన్నారు. మామిడిపల్లి, వేచలం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష క్యాంప్‌లను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు.

నాతవరం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అంకిత భావంతో నిర్వహించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఆయన సమీక్షించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, మాజీ సర్పంచ్ లాలం లోవ పాల్గొన్నారు. చమ్మచింత, మర్రిపాలెం సచివాలయాల్లో గ్రామసభ ఏర్పాట్లను ఎంపీడీవో హనుమంతరావు పరిశీలించారు. గునుపూడి గ్రామసభలో సర్పంచ్ వేముల సత్యనారాయణమూర్తి, ఎంపీటీసీ పోలుపర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

రావికమతం: పి.పొన్నవోలు, టి.అర్జాపురం–1 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష గ్రామ సభలు శనివారం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి కిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 వరకు రోజుకు రెండు బృందాల అధికారులతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

'విద్యుత్ బిల్లుల పెంపు తగదు '

కె.కోటపాడు/చోడవరంరూరల్/దేవరాపల్లి/నర్సీపట్నం: విద్యుత్ సంస్కరణ బిల్లును ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. విద్యుత్ చార్జీల పెంపుపై శుక్రవారం వారు ఆయా మండల కేంద్రాల్లో నిరసన చేపట్టారు.

రూ.3.60 లక్షలకు పీడీఎస్ బియ్యం వేలం ఖరారు

రావికమతం: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 18 టన్నుల బియ్యానికి స్థానిక పౌరసరఫరాల గోదాం వద్ద శుక్రవారం వేలం నిర్వహించారు. రావికమతం, బుచ్చెయ్యపేట, నర్సీపట్నం మండలాలకు చెందిన అయిదుగురు వ్యాపారులు పాల్గొనగా, సీతయ్యపేటకు చెందిన వ్యాపారి యలమర్తి సురేష్‌కుమార్ కేజీ బియ్యం అత్యధికంగా రూ.20కు వేలం పాడటంతో అధికారులు అతనికి ఖరారు చేశారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.3.60 లక్షలు సమకూరినట్టు ఆర్ఐ ఈశ్వరరావు తెలిపారు.

ప్రజల గుండెల్లో సంక్షేమ సారథి జగన్

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విప్ కరణం ధర్మశ్రీ


నేలపై కూర్చొని గిరిజనుల భూసమస్యలను సావధానంగా తెలుసుకుంటున్న విప్ ధర్మశ్రీ

రోలుగుంట: పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అడగకుండానే సంక్షేమ పథకాలు అమలుచేసి వారి గుండెల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోయారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. శుక్రవారం రత్నంపేటలో మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పార్టీ నాయకులతో కలిసి ప్రభుత్వ విప్ ఇంటింటా తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రామాలయం దిగువ వీధిలో డ్రైనేజీ కాలువ ఏర్పాటు చేయాలని వీధివాసులు కోరారు. సమస్య పరిశీలించి పరిష్కరించాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతోపాటు తన దృష్టికొచ్చిన మరి కొన్ని సమస్యలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ మండలాధ్యక్షుడు మడ్డు అప్పలనాయుడు, సర్పంచ్‌లు కర్రి రాము, సతీష్, మాజీ సర్పంచ్‌లు కుంచంగి హరిబాబు, అధికారులు ఉమామహేశ్వరుడు, సాధన, ప్రేమానందం పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్య తెలుసుకున్న విప్ ...

పనసలపాడు గ్రామానికి చెందిన గిరిజనులు భూమి సమస్యను ప్రభుత్వం విప్ కరణం ధర్మశ్రీ తెలుసుకున్నారు. ఇక్కడ భూములను గత తహసీల్దార్ స్థానికేతరుల పేరున మార్చి తమకు అన్యాయం చేశారని వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై 2, 3, 4, 6, 8 సర్వే నంబర్లలో 28 ఎకరాలను జగనన్న భూసర్వేలో తమకు దక్కకుండా చేశారని బాధిత రైతులు, సీపీఎం నాయకుడు గోవింద న్యాయం చేయాలని పట్టుబట్టారు. దీనిపై జేసీతో మాట్లాడి న్యాయం చేస్తామని విప్ తెలిపారు. బాధిత మహిళలు బోలోం, సిల్కు, బొల్లెం రాజేశ్వరి, అర్లి దేముడమ్మ, మాజీ సర్పంచ్ సత్యంనాయుడు పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ


వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

గొలుగొండ/రావికమతం: గొలుగొండ మండలం పుత్తడిగైరంపేటలో శుక్రవారం రైతులకు వరి విత్తనాలను సర్పంచ్ పత్తి రమణ పంపిణీ చేశారు. రావికమతం మండలానికి 960 క్వింటాళ్ల వరి విత్తనాలు సరఫరా అయ్యాయని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. మొలక శాతం పరీక్షలు చేసి సోమవారం నుంచి పంపిణీ చేస్తామన్నారు.

రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధి

- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


సమస్యపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: రాజకీయాలకతీతంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ 28వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ప్రతి ఇంటిని సందర్శించారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ వారి సమస్యలను సావధానంగా విన్నారు. వీటిని జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం చేశామన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు పొందలేని వారిని గుర్తించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చారని, మిగిలిన రెండు శాతం కూడా నెరవేర్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు ఇన్‌చార్జులు జాన్, గంటా లలిత, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాసరావు, ముస్లిం, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు షేక్ ఉన్నీషాబేగం, కర్రి శ్రీనివాసరావు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, నాయకులు చిటికెల కన్నబాబు, మామిడి శ్రీను, లోకవరపు శారద, కణితి అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ యాప్‌లో నమోదు

మాడుగుల రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ కార్యకలాపాలు ఆరోగ్య యాప్‌లో నమోదు చేయాలని వైద్యాధికారి కె. లీలాప్రసాదు తెలిపారు. శుక్రవారం కె.జె.పురం పీహెచ్‌సీలో ఆశ, ఆరోగ్య, కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలకు ఆయన అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి సర్వేలు వేగవంతం చేయాలని ఆదేశించారు. సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులు, బాలింతల సంరక్షణ వంటి కార్యక్రమాల గురించి సమీక్షించారు. ఎంపీహెచ్‌ఈవో పి. రామారావు, హెచ్‌వీ పుష్పకాంతం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రూ.157.3 కోట్లతో మంచినీటి పథకాల పనులు

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమీక్ష


ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: నియోజకవర్గ స్థాయిలో ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులు వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. చోడవరం కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు రూ.157 కోట్ల 30 లక్షలు మంజూరయ్యాయన్నారు. చోడవరం మండలానికి రూ. 35 కోట్ల 46 లక్షలు, పట్టణానికి రూ. 14 కోట్లతో పనులు చేస్తున్నామన్నారు. రావికమతం మండలానికి రూ.39 కోట్లు మంజూరు కాగా, రూ. 27 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. రోలుగుంటకు రూ. 29 కోట్ల 50 లక్షలు మంజూరు కాగా రూ. 16 కోట్ల 50 లక్షల పనులు పూర్తయ్యాయన్నారు. బుచ్చెయ్యపేటకు రూ. 39 కోట్లు మంజూరు కాగా రూ. 24 కోట్ల పనులు పూర్తయ్యాయని ధర్మశ్రీ చెప్పారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన వినతులను పరిశీలనలోకి తీసుకుని ఇంటింటికీ కుళాయిలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రూ. 13 కోట్లతో చోడవరంలో మంచినీటి పథకం పనులు వేగవంతం చేసి ప్రారంభించాలన్నారు. 119 పంచాయతీల్లోని మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీరందించాలని ఆదేశించారు. డ్రైనేజీల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలన్నారు. డీఈఈ శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు, సర్పంచ్‌లు పోతల జానకీప్రసాద్, మూడెడ్ల శంకరరావు, బండి నూకాలమ్మశ్రీను, శిరుచోళ్ల గణపతినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ల కమిటీ కన్వీనర్ అప్పారావు పాల్గొన్నారు.